www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 10 మార్చి 2025
5
తిరుపతి



ముక్కంటి సేవలో కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ భాగెల్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఈయనకు దక్షిణగోపురం వద్ద సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎన్ఆర్ కృష్ణారెడ్డి, లోకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పి4 సర్వే గుట్టు సర్కారుకెరుక



- తిరుపతిలో 50 వేల గృహాలకు సర్వే పూర్తి
- సామాజిక, ఆర్థిక అంశాలపై వివరాలు సేకరణ
- టీవీ ఉన్నా ఆస్తి కింద పరిగణన

మీ ఇంట్లో టీవీ ఉందా? ఫ్యాన్ ఉందా? ఫ్రిజ్ ఉందా? ఏసి ఉందా? మిక్సీ ఉందా? వాషింగ్ మిషన్ ఉందా? ద్విచక్ర వాహనం లేదంటే నాలుగు చక్రాల వాహనం ఉందా? ఇంట్లో ఎవరికైనా పెన్షన్ వస్తా ఉందా?ఐదు ఎకరాలు పొలం ఉందా? మీ ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా ఉన్నారా? మీ ఇంట్లో మహిళలు వర్క్ ఫ్రం హెూమ్ చేస్తున్నారా? వంటి విషయసేకరణకు సచివాలయ సిబ్బంది ఇంటింటికి వచ్చి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వే పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పథకాలు ఎక్కడ ఆగిపోతాయోనని సందేహ పడుతున్నారు.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పి ఫోర్ సర్వే అంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఒకపక్క సచివాలయ సిబ్బంది పథకాలు వస్తాయని చెబుతుండగా, మరి కొంతమంది ఉన్న పథకాలు ఎక్కడ తొలగిస్తారోనని ఆందోళన చెందుతున్నారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే సర్వే 95 శాతం సర్వే పూర్తయింది. త్వరలో ఈ సర్వే వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. ప్రపంచ బ్యాంకు షరతులతో, ప్రయివేటీకరణ విధానాలను నిత్యం జపం చేసే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు మరో అడుగు ముందుకేశారు. గతంలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పిపిపి) విధానాలను చాలా జోరుగా అమలు చేయడం చూశాం. ఇప్పుడు దానికి మరో పి(పీపుల్) చేర్చి పి4 విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పబ్లిక్ ప్రయివేట్ పీపుల్ పార్టనర్ షిప్ (పి4) విధానాన్ని జపిస్తున్నారు. ఈ ఏడాది ఉగాది నుంచి ఆవిధానాలను అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 55,129 గృహాలు ఉన్నాయి. శుక్రవారం నాటి లెక్కల ప్రకారం 50 వేల గృహాలకు సర్వే పూర్తి చేసినట్టు సమాచారం. ఇందులో 48 వేల మంది తమ అభిప్రాయాలు చెప్పినట్లు సర్వే చేసిన సిబ్బంది అంటున్నారు. మరికొందరిని సర్వే చేయాల్సి ఉంది. నగరంలో మొత్తం 103 సచివాలయాలు ఉన్నాయి. పి ఫోర్ తో పాటు మరో 13 సర్వేలు నగరంలో జరుగుతున్నాయి. త్వరలో గ్రామసభలు నిర్వహించి సర్వేలో గుర్తించిన నిరుపేదల వివరాలను వెల్లడించనున్నారు. తిరుపతి జిల్లాలో గ్రామాల్లో సుమారు 790 సచివాలయాలు ఉన్నాయి. అర్బన్ ప్రాంతంలో 150 దాకా ఉన్నాయి మొత్తం 940 సచివాలయాలు ఉన్నాయి. పి-4 సర్వేలో భాగంగా జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరించారు. గ్రామ వార్డు సచివాలయ శాఖ ద్వారా ఏయే కుటుంబాల వివరాలు సేకరించాలో ఇప్పటికే సచివాలయ సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలను నమోదు చేశారు. కుటుంబాల సామాజిక, యాప్‌లో పొందుపరచనున్నారు. సర్వే ద్వారా సంక్షేమ పథకాలు పోతాయనే భయంతో వివరాలు దాచి పెడితే సర్వే సిబ్బంది తాము స్వయంగా చూసి పరిశీలించిన అంశాలను అందులో నమోదు చేయాలని ప్రభుత్వం సూచించింది. సర్వే సందర్భంగా ఇంట్లో టివి లేదని చెప్తే సిబ్బందికి దాని శబ్దం వినిపిస్తే ఉందని నమోదు చేయనున్నారు. తమ ఇంటికి కరెంట్ కనెక్షన్ లేదని చెప్తే ఇంట్లో ఫ్యాన్ తిరుగుతుంటే ఆ సౌకర్యం ఉందని నమోదు చేయాలని సూచించడం జరిగింది.

పింఛను తీసుకునే వృద్దులూ సంపాదన పరులేనట!

సర్వే కోసం 27 రకాల ప్రశ్నావళిని రూపొందించారు. ఇట్లో వారి పేర్లు, ఆధార్ నంబర్ల కోసం గతంలో చేపట్టిన హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ డేటాను ఉపయోగించుకోన్నారు. సర్వేకు సమ్మతి తెలిపిన తర్వాత ప్రశ్నలను అడగడం జరిగింది. ఇంట్లో పెద్ద ఫోన్ ఉంటే నంబరు నమోదు చేసి ఓటిపి వెరిఫికేషన్ చేయనున్నారు. కుటుంబంలో సంపాదిస్తున్న వారి జాబితాలో పింఛను పొందుతున్న వృద్ధులనూ చేర్చడం అనుమానాలకు తావిస్తోంది. ఈ సర్వే పూర్తిచేసుకున్న వారిలో వ్యవసాయ భూమి ఉన్నవారు, వ్యవసాయ కూలీలు, అద్దె ఆదాయం పొందుతున్న వారూ ఉన్నారు. పసుపు రంగు నంబరు ప్లేటు ఉన్న నాలుగు చక్రాల వాహనాన్ని వాణిజ్య వాహనంగా, ఇంట్లో వ్యక్తిగతంగా ఉపయోగించే కారు, బైకులను వాణిజ్యేతర వాహనంగా పరిగణించనున్నారు. ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఉన్నారా? వంటి వివరాలు నమోదు చేయనున్నారు. ఇంట్లో టివి ఉన్నా ఆస్తిగానే నమోదు చేయనున్నారు. వీటితో పాటు లాప్‌టాప్, కంప్యూటర్, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, ఎసి వంటి పరికరాలనూ ఆస్తులుగానే పరిగణించబడతాయి. గత నెల ఎంత మొత్తంలో కరెంట్ బిల్లు చెల్లించారో వివరాలు సేకరించనున్నారు. తాగునీటి కోసం ట్యాప్ కనెక్షన్, పబ్లిక్ ట్యాప్, చేతిపంపులు, బావులు, క్యాన్ వాటర్ ఇలా ఏవి వినియోగిస్తున్నారో అడిగి తెలుసుకోనున్నారు. కుటుంబం పక్కా ఇంట్లో నివసిస్తుందా లేక కచ్చా ఇంట్లో ఉంటున్నారో వివరాలు నమోదు చేశారు. ఇంట్లో వంట గ్యాస్ వినియోగిస్తున్నారా? లేక కట్టెలు, బొగ్గు వంటి వంట చెరుకు ఉపయోగిస్తున్నారా? తెలుసుకొని నమోదు చేశారు. అర్బన్ ప్రాంతాల్లో సొంత ఆస్తులు ఏమైనా ఉన్నాయా వంటి అంశాలను సేకరించారు.

సర్వేపై ఆందోళన

ప్రభుత్వం చేపడుతున్న సర్వేపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం నిరుపేదలుగా గుర్తించిన తర్వాత రేషన్ కార్డులను అందజేసి వారికి సరుకులను అందిస్తోంది. ఇప్పుడు మళ్లీ నిరుపేదల గుర్తింపు పేరుతో సర్వే చేపట్టడంపై అందరిలోనూ అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్రజల్లో ఇటువంటి సందేహాలు వస్తాయని ముందుగానే అంచనా వేసిన ప్రభుత్వం సర్వేతో సంక్షేమ పథకాలకు ఇబ్బంది ఉండదని చెప్పాలని సిబ్బంది సూచించింది. ప్రభుత్వ ప్రాజెక్టుల ద్వారా అవసరమైన కుటుంబాలకు సంపన్నపరులైన వ్యక్తుల ద్వారా సాయం అందిస్తుందని వివరించాలని చెప్పింది. కుటుంబం ఆర్థిక పరిస్థితిని తెలుసుకోవడానికే సర్వే చేస్తున్నామని చెప్పాలని సూచించింది.

పి 4తో మేలేనా?

1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణల వచ్చిన అప్పటి నుంచి పాలకులు అమలు చేసిన పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్ (పిపిపి) విధానం ఎంత వినాశనకరమో వేరే చెప్పసక్కర్లేదు. ఉదాహరణకు ఇంధన సర్దుబాటు ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పటి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రికల్ బోర్డు (ఎపిఎస్ఈబి)ని మూడు ముక్కలు చేశారు. అందులో విద్యుత్ పంపిణీని డిస్కమ్‌లనపు ప్రయివేట్ కు అప్పగించారు. ఇప్పుడు అవే కంపెనీలు వినియోగదారులపై ఎడాపెడా చార్జీలను పెంచుతూ ప్రజలపై తీవ్ర భారాన్ని మోపుతున్నాయి. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా తెచ్చిన పి4 విధానం పైనా ప్రజల్లో అవే రకమైన సందేహాలు నెలకొన్నాయి. సంపన్నులకు ఏ ప్రభుత్వమూ సంక్షేమ పథకాలు వర్తింపచేయదు. వృద్ధులను సంపన్న పరులుగా నమోదు చేయడం, వారికి ఆ కుటుంబానికి మరే పథకాలు వర్తించనా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్రభుత్వం సర్వేలో సేకరిస్తున్న ఆస్తులు, ఇళ్లు, వాహనాలతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలునూ ఆస్తులుగా పేర్కొనడం ద్వారా తమ ఆర్థిక పరిస్థితి బాగున్నట్లుగానే పరిగణించి సంక్షేమ పథకాలకు దూరం చేస్తుందా అనే సందేహాలు ప్రజల్లో నెలకొన్నాయి. పేదల్లో ఉన్న 20 శాతం మందినే అత్యంత నిరుపేదలుగా గుర్తించేందుకు సర్వే చేపడుతున్నట్లు ప్రభుత్వం పేర్కొనడం, సర్వేలో సేకరిస్తున్న వివరాలు మరింత అనుమానాలకు ఆస్కారం ఇస్తోంది.

పాతెయ్ జెండా.. చేసెయ్ కబ్జా..!

36.34 ఎకరాల ఓటేరు చెరువుకి గాలం

టిడిపి మాజీ ఎమ్మెల్యే నిర్వాకం.. అడ్డుకున్న వామపక్ష, ప్రజాసంఘాలు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు ప్రభుత్వ భూముల కబ్జాకు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తారు. గతంలో వైసిపి నాయకులు, ప్రస్తుతం కూటమి నేతలు యధేచ్ఛగా చెరువులనే ఆక్రమించేశారు. తిరుపతి శివారు ప్రాంతంలో ఎకరా భూమి కోట్లల్లో విలువ ఉండటంతో ప్రభుత్వ పెద్దల అండదండలు చూసుకు రాత్రికి రాత్రే భూదందాలకు పాల్పడుతున్నారు. ఈ చెరువు కింద 28 ఎకరాల వరకు సాగు అవుతోంది. అంతేకాకుండా చుట్టుపక్కల నాలుగు గ్రామాల ప్రజలు తాగునీటికి ఈ చెరువుపై ఆధారపడి జీవిస్తున్నారు.తిరుపతి రూరల్ మండలం అవిలాల లెక్క దాఖలకు చెందిన సర్వే నెంబర్లు 370, 376, 377లలో 36.34 ఎకరాల విస్తీర్ణంలో ఓటేరు చెరువు ఉంది. 6లైన్ల బైపాస్ పక్కనే ఉండడంతో అధికార పార్టీ నేతల కన్ను ఈ చెరువుపై పడింది. కోట్ల విలువ చేసే ఈ భూమికి శ్రీకాళహస్తి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే అనుచరులు రాత్రికి రాత్రే చెరువును పూడ్చి చదును చేసి ఆక్రమించుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు, రైతులు కబ్జాదారులను అడ్డుకోవడంతో భూఆక్రమదారులు తిరగబడ్డారు. అడ్డువస్తే చంపేస్తామంటూ భయపెట్టారు. దీంతో వారు చేసేదేమీ లేక సిపిఎం, సిపిఐ, ఆర్పిఐ, కాంగ్రెస్ పార్టీలను ఆశ్రయించడంతో భూకబ్జా విషయం వెలుగులోకి వచ్చింది. గత రెండు రోజులుగా వామపక్ష, ప్రజాసంఘాలు ఘటనా స్థలానికి వెళ్లి ఆందోళన చేశారు. ఓటేరు చెరువును కబ్జా కోరుల నుంచి కాపాడాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఓటేరు చెరువును కాపాడుతాం: వామపక్ష, ప్రజా సంఘాలు

ఓటేరు చెరువును కబ్జాదారుల నుంచి రక్షించి రైతులకు, గ్రామస్తులకు సాగు, తాగునీరు అందించేలా ఉద్యమం చేస్తామని సిపిఎం, సిపిఐ, ఆర్పిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వందవాసి నాగరాజు, పి.మురళి, పి.అంజయ్య, మాంగాటి గోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ 36.34 ఎకరాల ఓటేరు చెరువును అన్యాక్రాంతం కానివ్వమన్నారు. శ్రీకాళహస్తికి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే అనుచరులు రౌడీల్లా వ్యవహరిస్తూ అక్కడి ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నారని చెప్పారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని హెచ్చరించారు. ఈ విషయంపై ఇప్పటికే ఆందోళన చేశామని, భవిష్యత్తు కార్యాచరణ కూడా ప్రకటించామని, జిల్లా కలెక్టర్ కూడా సంప్రదించామని చెప్పారు.

ఓటేరు చెరువు ప్రభుత్వం భూమి : జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి రూరల్ మండలం, ఓటేరు చెరువును ఆక్రమణల నుంచి కాపాడతాం. ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు కూడా పెట్టాం. ఆ భూములోకి ఎవరు వచ్చినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

టూరిజం కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలి : సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలనుంచి వచ్చే టూరిస్టులకోసం టూరిజం డిపార్ట్మెంట్‌లో పని చేస్తున్న గైడ్‌లకు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం ఒక ప్రైవేటు హోటల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిదిలుగా ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్రలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి టూరిజం డిపార్ట్మెంట్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వారికి ఎటువంటి సౌకర్యాలు ప్రభుత్వం వైపు నుంచి గాని, టూరిజం డిపార్ట్మెంట్ నుంచిగాని లేవన్నారు. వారందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు ప్రైవేట్ యాజమాన్యాల బస్సుల మేనేజ్‌మెంట్‌వారు కల్పించడం లేదని తెలిపారు. వారికి ఉద్యోగ భద్రత, వివిధ ప్రాంతాలకు వెళ్లినపుడు రక్షణకూడా లేదన్నారు. టీటీడీ అధికారులు కొండ మీదికి రాకుండా అడ్డుకొని కేసులు నమోదు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. తిరుపతి, తిరుమల టూరిజం ప్యాకేజీ రద్దు కావడంతో వారి ఉపాధి అగమ్యగోచరమైదని తెలిపారు. వారి సమస్యలపై భవిష్యత్తులో ఉద్యమం నిర్వహిస్తామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి టూరిస్ట్ గైడ్స్ యూనియన్‌ను ఏర్పాటు చేశారు. కమిటీఅధ్యక్షులుగా బి. బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా ఎస్ కరీముల్లా, కోశాధికారిగా అమర్నాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా పెద్దిరెడ్డి, సురేష్, హరి, నాగభూషణం, సహాయ కార్యదర్శులుగా రాము, మధు, తెలంగాణ హరి, చంద్రబాబు, కమిటీ సభ్యులుగా సుబ్రహ్మణ్యం, రమేష్, ఏకాంత్ నాయుడు, రామాంజనేయులు, రంజిత్ భాస్కర, రాజశేఖర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, హరి ప్రసాద్, వెంకట రమణారెడ్డి, హేమాద్రిలను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో దాదాపు 50 మంది సభ్యులు పాల్గొన్నారు.

టూరిస్ట్ గైడ్స్ యూనియన్ అధ్యక్షులు బాలాజి, కార్యదర్శి కరీముల్లా, ట్రెజరర్ అమర్‌నాథ రెడ్డి

అంగన్వాడి వర్కర్స్ అరెస్ట్ దారుణం

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని తలపెట్టిన ఆందోళన సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన చేపట్టబోతున్న అంగన్వాడి సిబ్బందిని అరెస్ట్ చేయడం దారుణమని పుత్తూరు సిఐటియు కార్యదర్శి ఆర్.వెంకటేష్ పేర్కొన్నారు. టీడీపీ నాయకులు ఇచ్చిన వాగ్దానాలను మరిచారని, అంగన్వాడీల సమస్యలు పట్టించు కోవడం లేదన్నారు. అరెస్టులతో న్యాయ బద్ధంగా చేసే పోరాట ఉద్యమాన్ని ఆపలేరన్నారు.

సిఐటియు నాయకుడు ఆర్ వెంకటేశులుకు హౌస్ అరెస్ట్ నోటీసు ఇస్తున్న దృశ్యం, అరెస్టయిన అంగన్వాడీ సిబ్బంది

తిరుమలలో టీటీడీ అటవీ కార్మికుడికి ప్రమాదం.. స్విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి

టీటీడీ యాజమాన్యం అటవీ కార్మికులకు న్యాయం చేయాలి: కందారపు మురళి విజ్ఞప్తి

స్విమ్స్‌లో పరామర్శిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి
ఇన్‌సెట్‌లో మృతి చెందిన అటవీ కార్మికుడు యానాదయ్య

ప్రజాశక్తి - తిరుమల : తిరుమల నందకం ఏరియాలో విధుల్లో ఉన్న టిటిడి అటవీ కార్మికుడు పి.యానాదయ్య (59) ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కిందపడి, కాళ్ళ మీద ట్రాక్టర్ చక్రం ఎక్కడంతో యానాదయ్య తీవ్ర గాయాలకు గురయ్యాయి. విధుల్లో ఉన్న అటవీ కార్మికులు హుటాహుటిన అశ్విని ఆసుపత్రికి తరలించారు. అశ్విని ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, తిరుపతిలోని బర్డ్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించటంతో స్విమ్స్‌కు తరలించారు. స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి స్విమ్స్ ఆసుపత్రికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. టీటీడీ అటవీ విభాగంలో వయసు పైబడిన వారికి, వారు చేయలేని పనులు అప్పజెప్పి వారి మరణానికి టిటిడి అధికారులు కారణమయ్యారని ఆరోపించారు. యానాదయ్య కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించి, ఆయనపై ఆధారపడి ఉన్న వారి కుటుంబ సభ్యులలో ఒకరికి టీటీడీలో శాశ్వత ఉద్యోగం కల్పించాలని కందారపు మురళి డిమాండ్ చేశారు. యానాదయ్య చురుకైన వ్యక్తి అని, యూనియన్ కార్యకలాపాల్లో చురుగ్గా ఉండేవారని, మూడున్నర సంవత్సరాల పాటు నిర్వహించిన నిరాహార దీక్షా శిబిరంలో ఆయన నిర్వహించిన పాత్ర కీలకమైందని కందారపు మురళి గుర్తు చేశారు. టిటిడి అధికారులు యానాదయ్య కుటుంబాన్ని ఆదుకోని పక్షంలో ఉద్యమం చేపడతామని కందారపు మురళి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణ, కృష్ణమూర్తి, స్విమ్స్ కాంట్రాక్టు వర్కర్స్ సీనియర్ ప్రధాన కార్యదర్శి రవి, గోపి తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్ళ మృతికి సిఐటియు సంతాపం

నివాళి అర్పిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి,

ప్రజాశక్తి - తిరుమల : ప్రముఖ వాగ్గేయకారుడు, టీటీడీ మాజీ ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ హఠాన్మరణం సంగీత ప్రియులకు తీరని లోటుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి అభివర్ణించారు. ఆదివారం సాయంత్రం భవాని నగర్, గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ నివాసంలో కందారపు మురళి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ తిరుమల తిరుపతి దేవస్థానానికి చేసిన విశేషమైన కృషిని గుర్తు చేశారు. మొట్టమొదటి తెలుగు వాగ్గేయకారుడు, అన్నమయ్య రచనలను వేల సంఖ్యలో గానం చేసి బాలకృష్ణ ప్రసాద్ ప్రసిద్ధులయ్యారని అన్నారు. సంగీత ప్రపంచంలో గరిమెళ్ళ స్థానం ఎవరు భర్తీ చేయలేనిదని కందారపు మురళి అన్నారు. నివాళులర్పించిన వారిలో కందారపు మురళితో పాటు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మేళ్లచెరువు గంగులప్ప కూడా ఉన్నారు.

టీటీడీకి తీరని లోటు : టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

టిటిడి ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో పరమపదించారు. ఆయన మరణం టిటిడికి, సమాజానికి తీరనిలోటని పలువురు గాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన నివాసం వద్ద టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి నివాళులు అర్పించారు.

టిటిడి ఆస్థాన గాయకుడు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ మృతి దిగ్భ్రాంతి కలిగించిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గరిమెళ్ళ మృతి శ్రీవారి భక్తులతో పాటు సంగీతప్రియులకు తీరని లోటని ఆయన చెప్పారు.

నిరంతర అభ్యాసం.. నిశిత అధ్యయనం

ప్రణాళికతో చదివితే పదిలో పదికి పది సాధ్యం

- ప్రత్యేక తరగతుల నిర్వహణతో మంచి ఫలితాలు
- రివిజన్ పరీక్షలు ఎంతో ఉపయోగకరం
- శ్రద్ధగా చదివి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం

ప్రజాశక్తి - ఓజిలి :మరికొద్ది రోజుల్లో పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.సమయం దగ్గర పడుతుండటంతో అటు విద్యార్థులు ఇటు ఉపాధ్యాయులు త్రీవంగా శ్రమిస్తున్నారు. ఉదయం, సాయంత్రం అదనపు తరగతులను నిర్వహిస్తూ పాఠ్యాంశాలను రివిజన్ చేస్తున్నారు. పదికి పది పాయింట్లు లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. ఇష్టంతో చదివితే కష్టమైనా సబ్జెక్టులను కుడా సులువుగా అర్థం అవుతుందని బోధన చేస్తున్నారు. 17 వ తేదీ నుంచి 31 వ వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగనుండటంతో, కాస్త సమయం చిక్కినా విద్యార్థులు చదువు పైనే దృష్టి పెడుతున్నారు.

పదవ తరగతి మార్కులతో ఉన్నత విద్యకు తొలి అడుగులు

పదవ తరగతిలో సాధించే మార్కులే ఏ విద్యార్థి ఉన్నత విద్యకైనా తొలి మెట్టు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా నైపుణ్యాన్ని పెంచి ఉత్తీర్ణత శాతాన్ని పెంచే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఓజిలి మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏపీఆర్ఎస్ పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులు మొత్తం ఈ ఏడాది 242 మంది పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షల సయయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ముందుగా టెస్టులు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక తరగతుల పర్యవేక్షిస్తున్నాం

పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా, ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ఏకాగ్రతతో చదవి మంచి మార్కులు సాధించాలి. ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేస్తున్నాం.

- జి.శైలజ, మండల విద్యాశాఖ అధికారిణి, ఓజిలి

రోజు పరీక్షలతో మాకు అవగాహన కలుగుతుంది..

ప్రతిరోజూ అన్ని పాఠ్యాంశాలకు సంబంధించి రివిజన్ పరీక్షలు పెడుతున్నారు. మరుసటి రోజు రివిజన్ పరీక్షల్లో ఉన్న తప్పులను మాతో సరి చేయిస్తున్నారు. ఉపాధ్యాయులు సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తాను

- టి.శ్రీహరి, పదవ తరగతి విద్యార్థి

ప్రత్యేక తరగతులతో మేలు..

ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో మాకు ఎంతగానో మేలు జరుగుతోంది. పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలనే పట్టుదలతో చదువుతున్నాను. ఉపాధ్యాయులు అన్ని సబ్జెక్టులు శ్రద్ధగా బోధిస్తున్నారు. మోడల్ పరీక్షల నిర్వహణతో పరీక్షలంటే భయంపోయింది. మేము కూడా పదిలో అత్యధిక మార్కులు తెచ్చుకోవడానికి ఎంతో ఇష్టపడి చదువుతున్నాం.

- పటాన్ ఫైజా, పదవ తరగతి విద్యార్థిని

పోలీస్ స్టేషన్‌కు చేరిన పది ప్రశ్నా పత్రాలు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: ఈ నెల మార్చి 17 వ తేదీ నుండి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు మండల కేంద్రం బి.ఎన్.కండ్రిగ పోలీసు స్టేషన్‌కు ఆదివారం ఉదయం చేరుకున్నాయి. పరీక్ష పర్యవేక్షణ అధికారులు, బుచ్చినాయుడు కండ్రిగ సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు.

వైసిపి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా కురుగొండ్ల ధనలక్ష్మి

ప్రజాశక్తి - నాయుడుపేట: మాజీ సీఎం వైయస్ జగన్ ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం కురుగొండ్ల ధనలక్ష్మిని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా నియమిస్తూ ఆదివారం ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన పార్టీ అధిష్టానానికి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైసీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ ప్రతిష్ట పెంచేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నిరుపేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు పట్టణం చర్చి వీధిలో 70 మంది నిరుపేద మహిళలకు మొహమ్మద్ ఫక్రుద్దీన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మొహమ్మద్ మగ్దూమ్ మొహిద్దీన్ మాట్లాడుతూ ప్రతి రంజాన్ పండుగను దృష్టిలో ఉంచుకొని నిరుపేద నిరాశ్రయులకు దుస్తుల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మొదట ఈ ప్రాంతం నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. షాదీ మంజిల్లో 12వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు 786 మందికి దుస్తుల పంపిణీ ఉంటుందని తెలిపారు. ఇప్పటికే టోకెన్లు పంపిణీ చేశామని తీసుకోని వారు తమ సంస్థ ప్రతినిధులను, అదే రోజు షాది మంజిల్ వద్దకు వచ్చి టోకెన్లు తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మొహమ్మద్ మగ్దూమ్ మొహిద్దీన్, సంస్థ ప్రతినిధులు మొహమ్మద్ అన్వర్ భాయ్, షేక్ అబ్దుల్ రెహమాన్, కరిముల్లా, దేవిక్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: నేరాల నియంత్రించేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు గూడూరు ఒకటవ పట్టణ సీఐ శేఖర్ బాబు పేర్కొన్నారు. గూడూరు ఒకటవ పట్టణంలోని అరుంధతి వాడలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక ప్రజలకు సూచించారు. ఈ తనిఖీల్లో ఒకటవ పట్టణ ఎస్ఐలు తిరుపతయ్య, వెంకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం రెడ్డి

ప్రజాశక్తి -కోట: వైసిపి అనుబంధ విభాగం (ఇంటలెక్చువల్ ఫోరం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గూడూరు నియోజకవర్గానికి చెందిన ఎన్వి సుబ్రహ్మణ్యం రెడ్డి నియమితులయ్యారు. మాజీ ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుండి సుబ్రహ్మణ్యం రెడ్డి వైఎస్ కుటుంబం విధేయుడిగా ఉన్నారు. సుబ్రహ్మణ్యం రెడ్డి పలు టీవీలలో జరిగే రాజకీయ చర్చలలో పాల్గొంటూ తనదైన రాజకీయ విశ్లేషణలతో వైసిపి గొంతుకను వినిపిస్తున్నారు. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఆ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన సేవలను గుర్తించిన పార్టీ రాష్ట్ర స్థాయిలో ఉన్నత పదవిలో నియమించింది. ఎన్వి సుబ్రహ్మణ్యం రెడ్డి మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి, వైసిపి ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, నెల్లూరు జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్యే మేరుగ మురళీధర్, తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమల రద్దీ ప్రాంతాల్లో పోలీసుల తనిఖీ

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో శాంతి భద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ, విజిలెన్స్ పోలీసింగ్ భాగంగా తిరుమల లో పోలీసులు, విజిలెన్స్ అధికారులతో కలిసి టూ టౌన్ సీఐ శ్రీరాములు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశంతో తిరుమలలోని పోలీసులు, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా నాన్ లోకల్ హాకర్లపై దాడులు చేశారు. భక్తులతో రద్దీగా ఉన్న ప్రాంతాలలో 25 మంది ఎలాంటి సర్టిఫికేట్స్, ఆధారాలు లేకుండా వ్యాపారాలు చేస్తున్న నాన్ లోకల్ హాకర్లను గుర్తించారు. నాన్ లోకల్ హాకర్లు నేర చరిత్రను గుర్తించేందుకు ఫింగర్ ప్రింట్స్, ఆధార్ డేటా తనిఖీ చేశారు. నేర చరిత్ర లేకపోవడంతో తిరుమల నుండి పంపివేశారు. అనుమతి లేకుండా ఎవ్వరూ తిరుమలలో వ్యాపారాలు చేయడం నేరమని, హాకర్స్ పోలీస్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాన్ లోకల్ హాకర్స్ కు పోలీసులు ఎవరు అనుకూలంగా వ్యవహరించిన అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నా పొలాన్ని నాకు ఇప్పించండి

మాట్లాడుతున్న తేజోమయానందం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తమకు పిత్రార్జితంగా వచ్చిన సత్యవేడు మండలం ఆరూరు గ్రామం ఇరువలం పోస్టులో 25 సర్వే నంబర్లలో 13 ఎకరాల భూమిని మా ప్రమేయం లేకుండా ఆన్‌లైన్ లో పేరు మార్పు చేసి రెవెన్యూ అధికారులు పొలం చేశారని, మా పొలాన్ని మాకు స్వాధీనం చేయాలని ఆ గ్రామానికి చెందిన రైతు తేజోమయానందం డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు స్పందించి విచారణ జరిపి, పొలాన్ని స్వాధీన పరచాలని కోరారు.

బాలికల వసతి గృహానికి వంట సామగ్రి అందజేత

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆదివారం స్థానిక జీవకోన రోడ్డులోని రీల్స్ సంస్థ ఆధ్వర్యంలో కేంద్రసర్వ శిక్ష నిధులు దాతల సహకారంతో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహానికి రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వంట పాత్రలు, స్టీలు హాట్ బాక్సులు, భోజన ప్లేట్స్, గ్లాసులు, టవల్స్, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, కొన్ని వంట సరుకులను వసతి గృహ నిర్వాహకులు శాకం కృష్ణమూర్తికి అందచేశారు. ఈ కార్య క్రమంలో సభ్యులు జి.ముని కృష్ణ, రాధా కృష్ణ, జి.గురు వయ్య, కె.రాజగోపాలచారి, జగన్నాథ నాయుడు, హరినాథ్, జి.రాజా, టి.జయలక్ష్మి, డి. భాగ్యలక్ష్మి, మెహరున్ని బీ, గోపాల్, టి.వేంకట రమణ, వాసుదేవ రెడ్డి, వసతి గృహ వార్డెన్ హేమావతి , జే. శైలజ, ట్యూటర్స్ జ్యోతి, మోనికాలు పాల్గొన్నారు.

వైసీపీ యువత పోరు విజయవంతం చేద్దాం : భూమన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మాజీ సీఎం, వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 12న జరిగే యువత పోరును విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతీ పురంలోని భూమన కరుణాకర్ రెడ్డి ఇంటి వద్ద పార్టీ ముఖ్యనేతలతో కలసి యువత పోరుకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు భూమన అభినయ్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, బియ్యపు మధుసూదన్ రెడ్డి, వైసీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం భూమన మాట్లాడుతూ తిరుపతి, చిత్తరూ జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద 12వ తేదీన యువతపోరుపై నిరసన వ్యక్తం చేసి కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమానికి బాధిత విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

పోటాపోటీగా టీటీడీ ఉద్యోగుల క్రీడలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన ఆటల పోటీల్లో వివరాలు ఇలా ఉన్నాయి. 45 ఏళ్లలోపు ఉద్యోగుల క్యారమ్స్ సింగిల్స్ పోటీల్లో రమేష్ విజయం సాధించగా, శ్రీ సుభాష్ రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్లలోపు ఉద్యోగుల క్యారమ్స్ డబుల్స్ పోటీల్లో కిరణ్, రమేష్ విజయం సాధించగా, చంద్రశేఖర్, సురేష్ రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్ల పైబడిన పురుష ఉద్యోగుల చెస్ పోటీల్లో విజయ కుమార్ విజయం సాధించగా, రమేష్ రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్ల పైబడిన మహిళా ఉద్యోగుల చెస్ సింగిల్స్ పోటీల్లో అనురాధ విజయం సాధించగా, సుశీల రన్నర్‌గా నిలిచారు. 45 ఏళ్ల లోపు మహిళ ఉద్యోగుల త్రోబాల్ పోటీలలో మహాలక్ష్మి విజయం సాధించగా, గిరిజ రన్నర్‌గా నిలిచారు. విశ్రాంత పురుష ఉద్యోగుల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో చంద్రశేఖర్ రాజు విజయం సాధించగా, రామ్మూర్తి రెడ్డి రన్నర్‌గా నిలిచారు.విశ్రాంత మహిళా ఉద్యోగుల బాల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ పోటీలలో లలితమ్మ విజయం సాధించగా, దేవికారాణి రన్నర్‌గా నిలిచారు.

రాస్ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాస్ సేవలు అభినందనీయమని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తెలిపారు. ఆదివారం స్థానిక ఏసీజీ కళ్యాణ మండపంలో రాస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ హాజయ్యారు. ఈ కార్యక్రమంలో రాస్ అధికారి నాగరాజు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ యుగంధర్, మాజీ కౌన్సిలర్ టీవీఎస్ ప్రసాద్, మాజీ జెడ్పిటిసి దేవానందం నాయుడు, టిడిపి నాయకులు, రాస్ మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: శ్రీకాళహస్తి–తడవైపు రోడ్డు, బుచ్చినాయుడు కండ్రిగ మెయిన్ రోడ్ జంక్షన్‌లో వైన్ షాప్ ప్రక్కన, గ్యాస్ పైప్ లైన్ కోసం గుంతలు లోడి పూడ్చకుండా వదిలేశారు. ఆ గుంతలు ప్రయాణికులకు చాలా ఇబ్బంది కరంగా మారాయి. ఆదివారం స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న గుంతలను జెసిపితో పూడ్పించారు. దుకాణాలకు ఎదురుగా టూ వీలర్స్ విచ్చలవిడిగా పార్కు చేసిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆటోలు ఎక్కడపడితే అక్కడ ఆపకుండా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఆపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రభాకర్, వేగన్, రంగా తదితరులు పాల్గొన్నారు.

గౌడ్ సంఘ అధ్యక్షుడుగా రాచపల్లి దేవరాజులు గౌడ్

నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న గౌడ సంఘ నాయకులు

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండల గౌడ్ సంఘ అధ్యక్షుడుగా రాచపల్లి దేవరాజు గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు బాబు గౌడ్ తెలిపారు. ఆదివారం మండలంలోని రాయల చెరువు పేట మాదాసు మురగయ్య స్వగృహంలో మండల కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా అరగొండ నరసింహులు గౌడ్, జడపల్లి మాతయ్య, కోశాధికారిగా మాదాసు మురగయ్య, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను రాష్ట్ర గౌడ్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ తుమ్మల చంగయ్య, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మాదాసు హేమలత గౌడ, జిల్లా గౌరవ అధ్యక్షులు చిరంజీవి గౌడ్‌లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దిండిపాటి కుమారస్వామి, గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు గాలేటి చిరంజీవి, గౌడ్ జిల్లా యువత అధ్యక్షులు నడవాటి మల్లికార్జున గౌడ్, తిరుపతి సిటీ అధ్యక్షులు తిరకాల మునుశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భూ యజమానులకు పరిహారం ఇవ్వలేదు : సురేష్

మాట్లాడుతున్న సురేష్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సత్యవేడు మండలం, ఆరూరు గ్రామం, ఇరువలం పోస్టులో 1940 ప్రాంతం నుండి మా స్వాధీన అనుభవంలో ఎ93.75 సెంట్లు ఉన్న భూములకు 2007లో శ్రీ సిటీ ఏర్పాటు కోసం చేసిన భూసేకరణలో భూ యజమానులుగా గుర్తింపబడ్డ తమకు ఎటువంటి నష్టపరిహారము ఇవ్వలేదని భూ యజమాని గణపతి కుమారుడు సురేష్ తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ నష్టపరిహారాన్ని అందించాలని, లేకపోతే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

విద్యావ్యవస్థలో మార్పులు అవసరం

ప్రజాశక్తి - క్యాంపస్ : భారతీయ విద్యావ్యవస్థలో సమూల మార్పులు ఆవశ్యకమని శ్రీలాల్ బహదూర్ శాస్త్రి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విసి ప్రొ.మురళీ మనోహర్ పాఠక్ పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం న్యూఢిల్లీ, సంస్కృత సంస్కృతి వికాస సంస్థాన్ న్యాస్, మధుర సంయుక్త తత్వావధానంలో జాతీయ నూతన విద్యావిధానం 2020, భారతీయ జ్ఞాన వ్యవస్థలపై ఏకీకరణ, పునరుజ్జీవనం అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సును ఆదివారం వర్సిటీలోని ప్రముఖ చెలికాని అన్నారావు సభాభవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.రవిశంకర్ మీనన్, ప్రొ.అర్కనాథ చౌధరీ, ప్రతిష్ఠానం డైరెక్టర్, న్యూఢిల్లీ ప్రొ.చాన్ద్ కిరణ్ సలూజా, ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ.ఆర్.జి.మురళీకృష్ణ, విసి ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక ఎస్ వి ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు బోధన సిబ్బంది ఆధ్వర్యంలో తిరుపతిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దూరవిద్యా కేంద్రంలో అధ్యయనం చేసేందుకు ఎంతో సులువుగా ఉంటుందని దీన్ని దృష్టిలో ఉంచుకొని తిరుపతిలో ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య బ్రాంది షాపులు పెట్టొద్దు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి రూరల్ మండలం సాయి నగర్ గ్రామపంచాయతీ రెసిడెన్షియల్ ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేయదలచిన బ్రాందీ షాపును తక్షణమే నిలుపదలు చేయాలని మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నదియా డిమాండ్ చేశారు. తిరుపతి శ్రీ పద్మావతి బైరాగిపట్టెడ రోడ్డు నుండి అవిలాలకు పోయే దారిలో రెసిడెన్షియల్ ఏరియాలో మద్య బ్రాందీ షాప్ పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బ్రాందీ షాపుకు వ్యతిరేకంగా విద్యార్థులతో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జింక నాగరాజు, గుజిరి వ్యాపారుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లాబక్షు, ఏఐఎస్ఎఫ్ నాయకులు మోహన్, విష్ణు, పవన్, మహిళా సంఘ నాయకులు రత్నమ్మ,విజయమ్మ, అలివేలమ్మ, ప్రజానాట్యమండలి నాయకులు డప్పుసూరి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికి చంద్రబాబు బాటలు వేశారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలోని మహిళల ఆర్థిక ప్రగతికి సీఎం చంద్రబాబు బాటలు వేశారని తిరుపతి పార్లమెంటు టిడిపి అధ్యక్షులు నరసింహ యాదవ్ అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేస్తానని ప్రకటించడం శుభ పరిణామం అన్నారు. భారతదేశంలోని ఏ రాష్ట్రంలో చేయని విధంగా మహిళ అభ్యున్నతి కోసం ఎన్డీఏ కూటమి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సి ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యురాలు కుమారమ్మ, గొల్ల రాము, యశోద, చంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని విద్య.. భవిష్యత్తుకు బాట

పిల్లలతో మాట్లాడిస్తున్న సిల్వర్ ఓక్స్ స్కూల్ చైర్మన్ వాసు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బాల్యం నుండి ఒత్తిడి లేని విద్యను పిల్లలకు అందివ్వగలిగితే వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని సిల్వర్ వోక్స్ ది స్కూల్ చైర్మన్ కేఎస్.వాసు అన్నారు. ఆదివారం తిరుపతి నగర పరిధిలోని మహతీ కళాక్షేత్రం వేదికగా సిల్వర్ వోక్స్ పాఠశాల 11వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని లా ఫియస్టా అనే పేరుతో ఘనంగా నిర్వహించారు. మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను పిల్లలతో అనుసరించే విధంగా నాటికలు, నృత్య కార్యక్రమాలు ప్రదర్శించామని వాసు తెలిపారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకత ఇటువంటి కార్యక్రమాలతో మరింతగా వృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మెన్ హెచ్.యం జి. శిరీష, ప్రైమరి ఇన్ చార్జ్ బి. లావణ్య, కిండర్ గార్డెన్ ఇన్ చార్జ్ జి. మంజులాదేవి, పిఆర్ఓ హరికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం : దినేష్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈనెల 12న కూటమి ప్రభుత్వం విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్ఆర్సిపి యువజన విభాగం పట్టణ అధ్యక్షులు దినేష్ పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను వైసిపి నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిద్విలాష్, జీవన్, సాయి రాకేష్, కిషోర్ రెడ్డి, మణికంఠ, అమీర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి రూరల్) పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ, ఇతర ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ25.50 వేల రూపాయల చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే పులివర్తి నాని పంపిణీ చేశారు. ఆదివారం తిరుపతి రూరల్ మండలం పరిధి, తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్, తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తిరుపతి, పాకాల మండలాలకు బాధితులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ కష్టాలలో ఉన్న మమ్మలను ఆర్థికంగా ఆదుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నానిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి బిరుదుల భాస్కర్ రెడ్డి. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీవీ.. ఆరోపణలు మానుకో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి నియోజక వర్గంలో బొజ్జల కుటుంబం అంటేనే టీడీపీ గుర్తుకొస్తుందని తెలుగు మహిళలు కొనియాడారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో తెలుగు మహిళలు ఆదివారం మీడియా సమావేశం నిర్వహించి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీపై నిప్పులు చెరిగారు. బొజ్జల కుటుంబం ఆది నుంచి టీడీపీలోనే ఉందని గుర్తు చేశారు. ఎస్సీవీ లాగా పార్టీలు, జెండాలు మార్చలేదని విమర్శించారు. ఇంకోసారి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిపై నిరాధరమైన ఆరోపణలు చేస్తే టీడీపీ శ్రేణుల నుంచి ప్రత్యక్ష తిరుగుబాటు తప్పదని తెలుగుమహిళలు హెచ్చరించారు. ఈ సమావేశంలో కృష్ణవేణి, సుప్రజ, సుమతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

హైందవ పరిరక్షణకు ఐక్యతగా కృషి చేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్ : తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘాల సంక్షేమ సమైక్య ఆధ్వర్యంలో పుత్తూరు శ్రీ గాయత్రీ బ్రాహ్మణ భవనంలో జిల్లా సమావేశం గౌరవాధ్యక్షులు ఆలూరు రామకృష్ణ, కొత్తపల్లి అజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి సత్యవేడు, నగరి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాలు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి తులసీరామ్ శర్మ, కొత్తపల్లి విజయ్ కుమార్, సూళ్లూరుపేట బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సుబ్బారావు , రేణిగుంట బ్రాహ్మణ సమాజం అధ్యక్షులు రామ్మోహన్, గూడూరు, వెంకటగిరి, టీటీడీ ఉద్యోగులు, వేద పండితులు, పుత్తూరు శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, సెక్రటరీ విజయ్ కుమార్, మాజీ సంఘ అధ్యక్షుడు కే.బాలాజీ, రమేష్, బాలాజీ రావు కిరణ్, సుజాత, సుమన్ మహిళలు పాల్గొన్నారు.తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పిఠాపురంలో ఈ నెల 14వ తేదీ నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభ జయప్రదం చేయాలని ఆ పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఆదివారం ఆవిర్భావ సభ గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొట్టే సాయి మాట్లాడుతూ జనసేన ఆవిర్భావ సభకు శ్రీకాళహస్తి నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు దండి రాఘవయ్య, నాయకులు కుమార్, మహేష్, గరికపాటి చంద్ర, ప్రతాప్, పగడాల సుధాకర్, నక్క ప్రసాద్, అరిగల వేణు, ఈర్ల చిరంజీవి, ఢిల్లీ బాబు, పసుపులేటి నవీన్, లీలాధర్, బాలాజీ, లోకేష్, కాపునాడు నాయకులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

తృటిలో తప్పిన ప్రమాదం

డివైడర్ ఢీకొని ఒరిగిపోయిన లారీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మండలం, శిరుగురాజ పాల్యం వద్ద తిరుపతి జాతీయ రహదారి గుజరాత్ నుండి చెన్నైకి వెళుతున్న పార్సల్ సర్వీస్ టార్బో లారీ శనివారం అర్ధరాత్రి పైన లారీ డివైడర్‌కు ఢీకొన్న ఘటన చోటు చేసుకుంది. చెన్నై మీదుగా వెళ్లే ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఓవర్ టాక్ చేయడంతోనే మధ్యలో వెళ తున్న మరో బస్సును తప్పించబోయినపుడు ఈ ప్రమాదం జరిగిందని డ్రైవర్ తెలిపాడు. ఈ ఘటనపై హైవే పోలీసులు కేసు నమోదు చేసే దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్.. ఇంటి సామగ్రి దగ్ధం

బాధితులకు ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి సామగ్రి దగ్ధమైన సంఘటన మండలంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. చిలమత్తూరుకి చెందిన బిషప్ ఇళ్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా విలువైన ఇంటి సామగ్రి దగ్ధమైంది. కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో హఠాత్తుగా మంటలు వ్యాపించాయి. వెంటనే గుర్తించి వెలుపలకు వచ్చారు. మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. కాని అప్పటికే మంటలు చుట్టుముట్టి ఇంట్లో సామగ్రి మొత్తం కాలి బూడిద అయ్యింది. ఇంట్లో సుమారు రూ.2 నుంచి 3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. స్థానిక సర్పంచి ఎల్లా కిషోర్ ప్రవీణ, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ఆర్థిక సాయం అందించాలని తహశీల్దారును కోరారు. తహశీల్దారు ఆదేశంతో వీఆర్‌వో రమణయ్య, సర్పంచ్ ప్రవీణ కిషోర్ రూ.5 వేలు నగదు 20 కిలోల బియ్యం అందించారు. అంతేకాకుండా ప్రభుత్వం తరపునుండి అన్ని విధాల సాయం చేస్తామని బాధితులకు సర్పంచ్ , ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వెంటనే స్పందించి ఆదుకున్న ఎంఎల్ఏకు, సర్పంచి ఎల్లా ప్రవీణ కిషోర్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

మృతి చెందిన మణికంఠ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు రూరల్ పరిధిలోని చినరాజుకుప్పం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు కుమారుడు, మణికంఠ (29) అనుమాన స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి వెలుగు చూసింది. గ్రామస్థుల కథనం మేరకు చినరాజుకుప్పం గ్రామానికి మణికంఠకు, తమిళనాడుకు చెందిన వీకేఆర్ పురం గ్రామానికి చెందిన జననితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి పిల్లలు లేరని సమాచారం. జనని శుక్రవారం అమ్మగారి ఇంటికి వెళ్లింది. ఆమె ఆదివారం సాయంత్రం తిరిగి వచ్చి, పుత్తూరులో బస్సు దిగి గ్రామానికి వెళుండగా, గ్రామస్తులు కనబడి నీభర్త చనిపోయాడని, పుత్తూరు ఆసుపత్రికి తీసుకొచ్చారని తెలిపారు. మణికంఠ, అతని చిన్నాన్న వెంకటేశులు ఇంట్లో రక్తపుమడుగులో పడి ఉన్నారని, పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారని ఆమెకు తెలిపారు. మణికంఠ తిరుపతిలోని మహర్షి అభ్యుదయ సేవా సంస్థలో విధులు నిర్వహిస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేఎస్పి ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: మార్చి 14న పిఠాపురంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను మండల జనసేన పార్టీ అధ్యక్షుడు దూది జస్వంత్, ఇంచార్జ్ కొమ్మిశెట్టి రూపేష్, రాజశేఖర్, జయశంకర్, దొరబాబు నాయుడు, మురళి, మల్లీశ్వరి, భాను, గిరి, బాలు, తేజ, మండల కమిటీ సభ్యులు చిన్నగొట్టిగల్లులో ఆవిష్కరించారు.

కొనసాగుతున్న వెటర్నరీ విద్యార్థుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం విద్యార్థుల స్టైపెండ్ సమస్యపై విద్యార్థులు చేస్తున్న నిరసన ఆదివారంతో 35 రోజులకు చేరుకుంది. సమస్యను సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, మంత్రి అచ్చెన్నాయుడుకు తెలియచేశామని, తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు దక్కని భరోసా..!

ఏటా రూ.15 వేలు సాయం చేస్తామని ఎన్నికల్లో హామీ

సంక్షేమ బోర్డు ఏర్పాటు ఊసే లేదు

బడ్జెట్‌లో రూపాయి కేటాయించని వైనం

గతంలో వాహన మిత్ర ద్వారా ఏడాదికి రూ.10 వేల సాయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎన్నికలకు ముందు ఒక మాట.. తర్వాత మరో మాట చెప్పడం.. అన్ని వర్గాలకు ఇష్టం వచ్చినట్లు హామీలు ఇవ్వడం, అధికారం వచ్చిన తర్వాత వాటిని అటకెక్కించడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారింది. ప్రజలను పదేపదే మోసం చేయడంలో తనకు తానే సాటి అని ప్రతిసారి ప్రభుత్వాలు నిరూపించుకుంటున్నాయి. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లు, హెవీ లైసెన్స్ కలిగిన లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, డ్రైవర్ల పిల్లలకు విద్యా రుణాలు ఇస్తామని మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఏ హామీ నెరవేర్చలేదు. తాజాగా ప్రవేశపెట్టిన 2025 – 2026 వార్షిక బడ్జెట్‌లో ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం పథకానికి రూపాయి కూడా కేటాయించలేదు. సంక్షేమ బోర్డు, ఇతర హామీలను పరిగణనలోకే తీసుకోలేదు. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి 15 వేలు ఆర్థిక సహాయం ఇవ్వాల్సిందేనని ఆటో డ్రైవర్లు డిమాండు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం సాయం అందించకపోగా అధికారంలోకి వచ్చిన రోజు నుంచే రకరకాల పేర్లతో అపరాధ రుసుములు విధిస్తూ తమపై బాదుడు మొదలు పెట్టారని ఆటో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో రూ.50 వేలు అందింది

గత ప్రభుత్వంలో వాహనం మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు చొప్పున సాయం అందించారు. ఐదేళ్లలో రూ.50 వేలు అందుకున్నాను. ఈ డబ్బులు ఇన్స్యూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, మరమ్మతులకు ఉపయోగపడేవి. ప్రస్తుత ప్రభుత్వంలో మాకు ఎలాంటి సాయం అందలేదు.

- వి.భాస్కర్ రెడ్డి, ఆటో డ్రైవర్, గూడూరు.